

# యుగళగీతం

మాదిరెడ్డి సులోచన

"శశీ... ఓ శశీ!"

"రాణిగారు అంతఃపురములో ఏమూలనుందిరో కదా! దాసానుదాసుని దాసుని సంపవలయునా!" హాస్యమాడుతూ గుమ్మంలో నిల్చున్నాడు రవి.

"మై డియర్ రవీ! అలా గ్రాంథికం మాట్లాడవద్దని యెన్నిసార్లు చెప్పాను." అల్లుకుంటున్న జడ ప్రక్కనే వేసుకుని వచ్చింది శశిరేఖ.

"యెన్ని సార్లు చెప్పావో లెక్క పెట్టలేదు డార్లింగ్..."

"అయ్యగారు యెందుకో మహా సంతోషంగా ఉన్నారు?"

"చెప్పుకో..." కన్ను చికిలించాడు. ఏదో ఘన కార్యం సాధించినట్లు, ఏదో అమూల్యమైన వస్తువు తనకు లభించినంత సంతోషించేను.

"యు ఆర్ మై స్వీట్ హార్ట్...... చెప్పూ" గారాలుపోతూ అతని భుజమ్మీద గడ్డం ఆన్చింది. అతను జేబులో ఉత్తరం తీసి ఆమె కిచ్చాడు. ఆతృతగా విప్పింది.

చి॥ రవిని

అక్క ఆశీర్వదించి వ్రాయునది

అమ్మను పంపమని, పదే పదే రాస్తున్నావు. అదికాక అమ్మకుకూడా మీ సంసారం చూడాలని ఉంది. నా ఇబ్బందులు ఉండేవే. అమ్మను ఆదివారం ఉదయము తీసుకువచ్చి వదిలివేస్తాను. శశిని అడిగానని చెప్పు. మిగతా క్షేమంలో...

ఇట్లు,
అక్క పద్మ"

చదివిన ఉత్తరం అలా వదిలి వంట ఇంట్లోకి వెళ్ళింది శశి. రవి మరోసారి ఉత్తరం చదివాడు. ఆరేళ్ళ పద్మని, మూడేళ్ళ రవిని వదిలిపోయాడు తండ్రి. తల్లి కాంతమ్మ యెన్నో కష్టాలు పడి పెంచింది. అప్పడాలు వత్తింది. చిన్న హోటలు కూళ్ళ యిల్లు నడిపింది. పెద్ద యిళ్ళల్లో పెళ్ళిళ్ళు అయితే వంటపనులు చేసింది. కాంతమ్మ దగ్గర రెండు సంవత్సరాలు భోజనము చేసిన మూర్తి, ఉద్యోగస్తుడు కాగానే పద్మను పెళ్ళిచేసుకున్నాడు. రవిని, కాంతమ్మను ఆదుకున్నాడు. రవి ఎమ్. ఏ. లో చేరగానే మూర్తికి తిరుపతికి ట్రాన్స్ఫర్ అయింది. తన ప్రాణస్నేహితుడు, సహృదయుడైన వెంకటేష్ ఇంటికి మార్చించాడు రవి బస. వెంకటేష్ భార్య సురేఖ పద్మను మరిపించింది. వారి స్నేహానికి ఫలితమే రవి, ఎమ్. ఏ పాసయి, లెక్చరరు కాగానే, సురేఖ చెల్లెలు శశిరేఖ రవి ఇల్లాలయింది.

వివాహం కాగానే రవి తిరుపతిలో భార్యతో కాపురం పెట్టాడు. అష్టకష్టాలు పడ్డ తల్లి తన నీడలో కొన్నాళ్ళయినా సుఖంగా, శాంతంగా ఉండాలని రవి కోర్కె. కాని పద్మకు ప్రసవించే రోజులు. కాంతమ్మ మరో సంవత్సరం అక్కడే ఉండిపోయింది. రవికి మాత్రం నిశ్చింతగాలేదు. బావ సహృదయుడు. అక్కకు తనేంచేసినా ఋణం తీర్చుకోలేడు. తన కింత సంతోషమైన విషయంలో శశి మౌనంగా ఉంది యెందుకో. అడుగుదామనుకునే లోపలే టింగ్, టింగుమంటూ విద్యార్థులు వచ్చారు.

"ఏమిటోయ్ ఈ దండయాత్ర?"

"సర్! మీరు మహాబలిపురం రానన్నారట. మీరు రావాలి."

"ఆదివారం మా అమ్మ, అక్క వస్తారు..."

"ఆదివారం ఇంకా నాలుగు రోజులుంది. శనివారం తిరిగి రాము!"

"ఇంట్లోకి సామాన్లు అవీ..."

"ఏం కావాలో వచ్చాక చెప్పండి. తలోకటి పట్టుకువస్తాం" ఇక లాభంలేదని ప్రయాణం అయ్యాడు.

శనివారం రాత్రి అలసటగా నిదురపోయాడు. అలారమ్ పెట్టుకు నిదురపోయాడు. అలారమ్ మ్రోగలేదు. పాలవాడి కేకతో మేలుకుని, టైమ్ చూచాడు. ఆరు! అయిదింటికి అలారమ్ పెడితే మ్రోగలేదు. బటన్ నొక్కి వుంది. అలవాటు ప్రకారం శశి నొక్కిందేమో. నవ్వుకుంటూ లేచాడు. ఏడుకంతా బస్ స్టాండ్‌లో ఉండాలి."

"శశీ." కిత, కితలు పెట్టాడు.

"ఏమిటి..." విసుగ్గా చూచింది.

"లే డియర్. ఏడుంపావుకు బస్ వస్తుంది. అమ్మను రిసీవ్ చేసుకోవాలి. బి క్విక్." బాత్ రూమ్‌లో దూరాడు. స్నానాదులు కానిచ్చి వచ్చినా, శశి లేవలేదు.

"బాబ్బాబు, యెన్నిసార్లు లేపాలి శశీ."

"ఏం చెప్పమంటారండి. నా తల పగిలిపోతుంది. నాకెక్కడికీ రావాలని లేదు." అన్నది ముసుగు తీయకుండానే.

"అరె! ఆ మాట చెప్పవేం. కాఫీ ఫ్లాస్క్‌లో పోసి వెళ్తాను. లేవాక సారిడాన్ వేసుకో. హావ్ రెస్ట్ మై స్వీట్ డార్ల్," వంగి ఆమె ముంగురులు సవరించాడు. శశి అంటే అతనికి అమితమైన ప్రేమాభిమానాలున్నాయి. ఆమె బాధ చూడలేడు. భర్త వెళ్ళిపోగానే లేచింది శశిరేఖ. క్రిందిపెదవు పంటితో నొక్కిపట్టి లేచింది.

"అమ్మా బొయ్యమీద నీళ్లు పడేయనా?"

"మంగమ్మా... ఈ పూట ఏంపనిలేదు. హాయిగా వెళ్ళి నీ పిల్లలతో ఆడుకో..." సంతోషంగా వెళ్ళింది మంగమ్మ. శశి ముఖం కడిగి కాఫీ త్రాగి మంచం యెక్కింది.

"అయ్యోపాపం... చాలా నొప్పే వచ్చినట్టుందిరా. యింకా లేవలేదు." బయట కాంతమ్మ గొంతు వినిపించింది.

"ఏరా ఏమైనా సంతోషవార్తా? పద్మ అడుగుతుంది.

"నువే అడుగక్కా." రవి పెట్టెలు దించుతూ అన్నాడు. పద్మా, కాంతమ్మ చనువుగా గదిలోకి వచ్చారు.

"జ్వరంగా ఉందా?" పద్మ శశి నుదురు తాకింది. బలవంతంగా కళ్లువిప్పింది. శశి మర్యాదకయినా వారి యోగక్షేమాలు అడుగలేదు.

"యే చిన్న శబ్దం విన్నా తల పగిలిపోతుంది." అన్నది విసుగ్గా. పద్మ సూక్ష్మగ్రాహి. వెంటనే తల్లిని తీసుకుని బయటికి వచ్చింది. రవి సామాన్లు గదిలో పెట్టాడు.

"మంగమ్మా...ఓ మంగమ్మా! మంగమ్మ రాలేదా శశీ!"

"నాకేం తెలుసు. ఒకవైపు తల పగిలిపోతుంటే ఏమిటా కేకలు!" పెద్దవారిముందు శశి అలా మాట్లాడినందుకు రవికి తలతీసినట్టు అయింది. ధనవంతులపిల్ల పెంకితనం ఉన్నాయి అనుకుంది కాంతమ్మ. తల్లీ కూతుళ్లు అంట్లుతోమి, స్నానాలు చేసి వంట ప్రారంభించారు. రవికి చెప్పలేనంత బాధగా ఉంది. వారి వెనకాలే తిరుగుతూ, అన్నీ అందించాడు.

"అబ్బాయ్ భోజనంచేదురా." కాంతమ్మ గుమ్మంలో నిలబడి పిల్చింది.

"అప్పుడు శశీ. అమ్మ చేతివంట తిను. తల నొప్పి నీరసం అన్నీ పోతాయి."

నాకు ఆకలిగా ఉంటే తింటాను విసిగించకండి" పద్మముఖం వివర్ణం కావటం చూసి రవి తల వంచాడు. అతనిపరిస్థితి దుర్భరంగావుంది. భార్యను నాలుగు అంటించి పనిచెప్పేందుకు సంస్కారం అడ్డు వస్తుంది. తలనొప్పికాదు నటన అని అతనికి బాగా తెలుస్తుంది. అన్యమనస్కంగా భోజనాలు ముగించారు. కొండపైకి, కపిలతీర్థం, మంగాపురం, అక్కను తల్లిని తీసుకెళ్ళాలని అతని ఉబలాటం.

"రవీ, అవన్నీ చూచేరోజులు ముందున్నాయి వచ్చాముకాబట్టి ఆ శ్రీనివాసుడి దర్శనం చేసుకొని వెళ్తాను. మీ బావగారి పిల్లలు ఎప్పుడు ఒంటరిగా ఉండలేదు."

బావకు నేను ఉత్తరం రాస్తానులే..."

"వద్దురా. ఆయనకు వంటరాదు. హోటలుతిండి తినలేరు." రవి బలవంతం చెయ్యలేదు. మూడు రోజులు శశి గదివదలిరాలేదు. తిరిగినంతసేపు తిరిగి యింటికివస్తే మహా ఇబ్బందిగావుంది. ఉన్నవి మూడుగదులు. ఒకటి శశి పడకవేసింది. వంటఇంట్లో, వసారాలో కాలక్షేపం అవుతుంది. రవి భార్యతో ఒంటరిగా మాట్లాడి అసలు విషయం తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఆ సాయంత్రం త్వరగా యింటికి వచ్చాడు. శశి జడ అల్లుకుంటూంది.

"అమ్మా...అక్కయ్య యెక్కడికి వెళ్ళారు శశీ."

"గాజులు...ఏవో కొంటారట వెళ్ళారు."

"ఈ ఊరు వాళ్ళకు క్రొత్త. నువ్వు వెళ్ళలేకపోయావా?"

"ఇక నాకేం పని లేదు."

"నాలుగు రోజుల నుండి చూస్తున్నాను నీ తరహా. ఏం బావుండలేదు. అమ్మ, అక్కయ్య ఏమనుకుంటున్నారో..."

"యెవరో అనుకుంటారని నేను యెందుకు బాధపడాలి..."

"యెవరో కాదు...నా తల్లి..."

"అమ్మ...తల్లి...తల్లి, ప్రపంచములో యెవరి అమ్మ లేనట్టు."

"అసలు అమ్మ, అక్క రావటం నీ కిష్టం

లేనట్టుంది."

"మీకు మాత్రం ఇష్టంగా ఉందా? క్రొత్త దంపతులం హాయిగా ఉండాలని యెవరికుండదు.."

"శశీ!" గట్టిగా అరిచాడు "అసలు నీకు మతి ఉందా?"

"ఏం డాక్టరు దగ్గర పరీక్ష చేయిస్తారా? అక్కరలేదు. సంసారమంటే నేనూహించుకున్న చక్కని కల, స్వర్గం. అక్కడ మీకు నాకు తప్ప మరెవ్వరికి స్థానం లేదు. మీ అమ్మ అక్కడ వుంటానికి వీలు లేదు..."

"ఏమన్నావ్! గర్జించాడు." ఆమె యిక్కడే వుంటుంది. ఆమె నా తల్లి". అతని ముఖం కంద గడ్డలా అయింది. అదేం గమనించలేదు.

"యెందుకలా గొంతు చించుకుంటారు. మీ తల్లి కాదని యెవరన్నారు. నాకు తల్లి ఉంది. మా అన్నయ్యల దగ్గర లేదు. హాయిగా ఊర్లో వుంది. ఆమెను మీ అక్కదగ్గరే ఉండమను. నెలా, నెలా కొంత డబ్బు పంపుదాం."

"ఛీ...నీ డబ్బుకు మా అక్కయ్య మొహం వాచేం లేదు. చదువుకున్న నీకు సంస్కారం ఉంటుందని భ్రమించాను. నీహృదయం అమృతం అనుకున్నాను. అంతా ఉట్టిదే. నీ...అమ్మకు పొలం పుట్రా వున్నాయి. అన్నింటికి మీ నాన్న ఉన్నాడు. ఆవిడ యెక్కడయినా ఉంటుంది."

"మీరు యెన్ని అయినా అనండి. నా యింట్లో యెవరు ఉండటాన్ని నేను అంగీకరించను." మొండిగా అంటుంది. శశి అక్కడుంటే ఆమె చెంప పగలగొట్టే దుస్థితి ఏర్పడుతుందని బయటి గదిలోకి వచ్చిన రవిముఖం తెల్లగా పాలిపోయింది. పద్మ కుర్చీలో కూర్చుని ఉంది.

"అక్కా నువ్వు వచ్చేశావా ;...అమ్మ ఏది?"

"బయట చంటివాడిని దొడ్డికి కూర్చోపెట్టింది మలిన వదనము అక్కకు చూపించలేక. ఇల్లు వదలి పోయాడు రవి. చాలా రాత్రికి వచ్చాడు. కాంతమ్మ అలసి నిదురపోయింది. పద్మ పత్రిక తిరగేస్తూ కూర్చుంది. భోజనం చేశాడు.

"రవీ...అమ్మన్నేను నాతోపాటు తీసుకువెళ్తానురా." అన్నది.

"అదేమిటక్కా?"

"అంతా నీకు తెల్సు, నేను చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను.

"లేదక్కా. అవి యెంత మాత్రం వీలులేదు అమ్మ యిక్కడే ఉంటుంది. ఆమెకు లోటురాదని హామీ యిస్తున్నాను."

"నీ ఒక్కడితోనే సామరస్యం పరిపోదురా. బలవంతంగా భక్తుల్ని చెయ్యలేం. అయినా మీకు పిల్లలు పుట్టుకవస్తే పెద్దవారి అవసరం ఏమిటో బోధపడుతుంది. అంతవరకు అమ్మ నాదగ్గరే ..."

అక్క చెప్పింది సమంజసంగానే తోచింది. తను బలవంతంగా ఉంచితే, యెప్పుడో అవమాన పరి వెళ్ళగొట్టవచ్చుగా ...

మర్నాడు అక్కను, తల్లిని బస్సుయెక్కించాడు. తల్లికి, అక్కకు బట్టలు పెట్టాడు. శశి ముక్తసరిగా మాట్లాడింది.

"రవీ! నువ్వెక్కడున్నా సుఖంగా ఉండాలిరా. శశి చిన్నపిల్ల తగూవద్దు." కాంతమ్మ కంఠం గద్గదం అయింది. రవి కన్నీటిని అదిమిపట్టాడు. బస్సు కదలగానే భోరుమంది కాంతమ్మ.

"ఏమిటమ్మా ... ఊరుకో..." ఆ క్షణంలో పద్మ తల్లి అయింది. కాంతమ్మ కూతురయింది.

"యెన్నాళ్లు పద్దూ ... నీకు భారం?"

"అమ్మా ... నువ్వలా అంటే నాకు కోపం వస్తుంది. నువ్వునాకు భారమా? కాలం మారిపోయింది. కొడుకులు, కూతుర్లు అంతా సమానమే. నీవు నిన్ను విడిచి ఉండవని ఆయనకు తెగులు. నువ్విక్కడ ఉండటం ఏ మాత్రం యిష్టం లేదు." యెన్నో విధాలుగా తల్లిని ఓదార్చింది పద్మ.

* * *

"అబ్బా!" చేతిలోని పుస్తకం లాగి బల్లపై పెట్టింది శశి.

"అలక దేవికి" విసుగ్గా అటు తిరిగి పడుకున్నాడు. అయితే రెండు మూడు రోజులలో రవి మామూలుగా మారాడు.

శశిమనసు మారనేలేదు. భర్తవంక బంధువులు రాకూడదు. వేసవి సెలవులకు, యెంత వారించినా వినక, వచ్చిన పద్మ కూతురు, వారం రోజులుండ లేక పోయింది. శశి సూటిపోటి మాటలకు. రవి క్యారియర్ తెప్పించేవాడు. మరోసారి రవికున్న ఒకే ఒక బంధువు పినతండ్రి వస్తే. మర్నాడే అక్కడగ్గరకు మద్రాసు ప్రయాణం అయింది శశి.

రవికి శశి ఓ సమస్యగా తయారయింది. ఏమన్నా శశి లెక్కచేయదు. చెయ్యి చేసుకునే సంస్కారం రవిలో లేదు. 'ఉమెన్ ఈజ్ వీక్‌నెస్ ఆఫ్ మ్యాన్' అన్నాడో ఆంగ్లమహాశయుడు. కాలం నడుస్తుంది. కాలేజినుండి వచ్చి బూట్లు విప్పుకుంటున్నాడు రవి.

"ఏమండీ...శ్రీవారూ... ఒక మంచి వార్త" నవ్వుతూ వచ్చింది శశి.

"ఏమిటో!"

"మా అక్కయ్య సురేఖ వస్తుందట-యెల్లుండే."


"నిజమా సురేఖను చూచి చాలా రోజులయింది" అతని వదనము ప్రసన్నం అయింది. వదినే కాక సహృదయురాలయిన స్నేహితురాలు.

"ఇదిగో...ఇప్పుడే చెబుతున్నా. వారంరోజులు సెలవు తీసుకోండి ... చిన్నదానికి చిరుతిళ్ళు కావాలి. ఈరోజే వస్తువులు, జీడిపప్పు పట్రండి. స్టేషనుకు ఆరింటికే వెళ్ళాలి ... అప్పు నేనొస్తే అక్కయ్యకి కాఫీ యెలా! మీరే వెళ్ళిరండి... అన్నట్టు కూరకాయలు తీసుకురండి."

"అంత ఎక్సైట్ అవకు. నీ ఆజ్ఞానుసారమే అన్నీ తెస్తాను."

"థాంక్స్ పాలవాడితో చెప్పండి. అదనంగా లీటర్ పాలు మంచివి తెమ్మని ... ఆఁ" వడిగా వంట యింట్లోకి వెళ్ళిపోయింది.

బండి దిగగానే సురేఖ చేతుల్లోంచి పాపను



అందుకున్నాడు.

"శశి రాలేదేం?"

"మీ కోసం ఫలహారం తయారు చేస్తోంది. మీరు ఒక్కరే వచ్చారేం?"

"సరి ఆయనకు తీరికేది! బోరవిపించింది. మీ కొత్త కాపురం చూద్దామనిపించింది వచ్చాను." సామాన్లు దింపించి కూలి నెత్తిన పెట్టాడు. బయటికి వచ్చి, టాక్సీని పిలుస్తుంటే వారించింది సురేఖ. గుర్రపు బండిలో కూర్చున్నారు.

"నువ్వలా దిగులుగా ఉన్నావేం?"

"ఏం లేదు. బాగున్నాను.

"నా దగ్గర కూడా దాపరికమేనా? శశి నా దగ్గర మాట్లాడిన మాటల తీరు సందేహంగా కనిపించింది. అత్తయ్యా వాళ్ళు యెందుకు వెళ్ళిపోయారు. అత్తయ్య నీ దగ్గరే ఉంటుందనీ పద్మ రాసింది." తరచి, తరచి అడగ్గా. రవి దాచలేకపోయాడు. శశిరేఖ ప్రవర్తన, కాంతమ్మ, పద్మా వెళ్ళిపోవటం అన్నీ చెప్పాడు.

"నా వైపు బంధువులెవరు రావద్దంటుంది." భారం దిగినట్టు నిట్టూర్చాడు రవి.

"నిజమేనా రవి నువ్వంటున్నది? నిజమే అయితే నువ్వు చేతులు కట్టుకుని కూర్చున్నావా?"

"ఏం చెయ్యమంటారు? ప్రేమగా నచ్చ చెప్పాలని చూచాను. కోపగించాను. ఉహూ... మారందే..."

"మార్పు తేవాలి రవీ! నువ్వింత మార్దవంగా ఉంటే పనులు జరగవు. ఈ విషయము రెండు కుటుంబాలకు సంబంధించినది. ఫలానా వారి అమ్మాయి. ఇలాంటిదంటే యెంత అప్రతిష్ఠ!" చిన్నబోయిన ముఖంలో తీవ్రమైన ఆలోచన కనిపించింది. ఆ వివాహము తను సారధ్యము వహించి జరిపించిందాయే. మెరుపులాంటి ఆలోచన తట్టింది.

"రవి నేను వస్తున్నానంటే శశి మూడ్స్ ఎలా వున్నాయి?"

"ఆదేం మాట, చాలా సంతోషంగా ఉంది.

"ఉహూం...అయితే నేను చెప్పినట్టు విను. ఏ మాత్రం పొరపాటు జరుగవద్దు. అప్పటికి దారికి రాకపోతే నేను కలుగజేసుకుంటాను." ఉపాయం చెప్పింది సురేఖ.

"వదినా!" అంతా విని తెల్లమొహము వేశాడు రవి.

"అంత బెంబేలు పడొద్దు. సంసారం ఒక యుగళగీతం రవీ, ఇద్దరూ తను భాగం పాట అంపిస్తే రమ్యంగా ఉంటుంది గీతం. లేకుంటే శృతి తప్పుతుంది. స్త్రీని గౌరవించు కాని అంత పూజించటం చేతకానితనమే అవుతుంది..."

"అయితే మీరు చెప్పిందానికి రెండింతలు..." రోషంగా తలెత్తాడు.

"ప్రతిజ్ఞలు వద్దు. ప్రయత్నం మాత్రమే." దూరంనుండి ఇల్లు చూపించి దిగిపోయాడు రవి.

వాకిట్లో బండి ఆగగానే బంతిలా వచ్చింది శశి అక్క చేతిలోని పాపను ఒక చేత్తో, పంచిని రెండో చేత్తో అందుకుంది.

"అంత తీరని పనులేం చేస్తున్నారమ్మా మీ దంపతులు! ఉత్తరం రాసినా స్టేషనుకు రాలేదు. ఇల్లు కనుక్కునేసరికి తాతలు దిగివచ్చారు. ఏదీ నీ రాజేంద్ర భోగి?" బండి వాడికి డబ్బులిచ్చి పంపివేసింది.

"ఆయన స్టేషను కొచ్చారక్కా. బండి త్వరగా వచ్చి ఉంటుంది.

"ఏమో! మీ ఆయన లేటుగా బయలుదేరొచ్చు కాస్త కాఫీ నాకు ఇవ్వు." అక్కా, చెల్లెలి కబుర్లకు అంతే లేదు. పన్నెండయినా, వంట అయినా రవి జాడలేదు.

స్టేషనుకు వస్తానన్నమనిషి జాడలేదు. యెక్కడకెళ్లాడో! నువ్వు భోజనం చెయ్యక్కా." అక్కకు వడ్డించింది. రవి వచ్చాడు.

"ఏమండి మరిదిగారూ, బావున్నారా?" కొంటెగా అడిగింది.

"ఊఁ..." ముక్తసరిగా తలాడించి బాత్‌రూమ్ వైపు వెళ్ళాడు. శశి తనకు, భర్తకు వడ్డించింది.

"ఏమండి ఇంతసేపు యెక్కడున్నారు? స్టేషన్‌కు వెళ్ళలేదూ?"

"నాకు వేరే పనులేం లేవా? తీక్షణంగా అడిగాడు. శశి తెల్లబోయింది. తనభర్త తనను యెంత అభిమానించేది అక్కకు చూపించాలనుకుంటే ఎన్నడూ లేని దీయన ఇలా మాట్లాడారేం? రవి తలెత్తి సురేఖ వంకయినా చూడలేదు.

"ఏమిటే మీ ఆయన అంత ముభావంగా ఉన్నారు? నేను రావటం ఇష్టంలేదా?"

"యెందుకులేదూ! అసలేం జరిగిందో కనుక్కుంటానుండక్కా. వాళ్ళ ప్రిన్సిపాల్ సెలవుయివ్వలేదనుకుంటాను." శశి వంటిల్లు సర్ది హాల్లో వచ్చింది. రవి మంచంమీద హాయిగా పడుకున్నాడు. అక్క విశ్రాంతికని తెల్ల దుప్పటి వేసింది శశి.

"ఏమండీ..."

"చెప్పండి"

"మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడదామని వచ్చాను."

"సరిగ్గా నేను అదే మాట్లాడాలని... ఏం లేదు మీ అక్క ఎన్నాళ్ళు ఉంటుంది?"

"మీ ఉద్దేశం ఏమిటి? వచ్చినవారిని ఎన్నాళ్ళుంటావని అడుగుతామా?"

"అడుగు ఆవిడున్న నాల్గురోజులు ఏ స్నేహితునింట్లోనైనా తలదాచుకుంటాను. వెధవగోల."

"ఏమిటి మీరు మాట్లాడుతున్నది?"

"అచ్చం తెలుగు. పచ్చినిజం."

# వేదన

**- వక్కలంక లక్ష్మీపతిరావు**

నిప్పువంటి నాజాతిని
నివురు కప్పివేస్తున్నది
త్యాగశీల మగుజాతిని
స్వార్థం పీడిస్తున్నది!

సత్యాహింసల బురఖా
స్వార్థం ధరియిస్తున్నది!
రామరాజ్య మవునన్నది
క్షామరాజ్య మవుతున్నది!

నీతిబోధకులలో అవి
నీతి పెరిగిపోతున్నది!
మచ్చరించు కూటదృష్టి
రచ్చకెక్కి పోతున్నది!

సంఖ్యాబల మున్నమాట
శాసనమె పోతున్నది!
వెనుదీయక గ్రుద్దువచ్చి
పిల్ల నెక్కిరిస్తున్నది!

విసురుగా అవిద్యవచ్చి
విద్యను అదలిస్తున్నది!
అజ్ఞ నెదుట తలవంచుచు
విజ్ఞత విలపించుచున్నది!

అధికార వ్యామోహం
హద్దుమీటి పోతున్నది!
దాంభికునికి సంఘ మగ్ర
తాంబూలము నిస్తున్నది.

నిజమాడు అమాయికునికి
నిష్ఠుర మెదురౌతున్నది!
పదుగురాడు నసత్యమున
కొదిగి నిజం చస్తున్నది!

దొంగబుద్ధి తెలుగుమీటి
దొరవేషం వేస్తున్నది!
తెలియమపుల దాగకెదద
నలుపు బయట పడుతున్నది!

మాటల నమృతమ్ము చిలికి
మనసు బుసలు కొడుతున్నది!
ఐకమత్యమను పేర న
నైక్యత సృష్టిస్తున్నది!

శివమెత్తిన దుష్టశక్తి
చిందులు త్రొక్కేస్తున్నది!
రాణించని అరాజకం
రైళ్ళను పడగొడుతున్నది!

అచ్చెరువడి దేశం గ్రు
డ్లప్పగించి చూస్తున్నది!
"ఈ జాతికి మోక్షమింక
ఎపుడా?" అనిపిస్తున్నది.

"అప్పు లెడుగే. మీరు మా అక్కనే... వెధవ గోల అంటున్నారా?"

"మరింకేం అనను! పడకగదిలో పడుకుని వంటింట్లో పడుకో మనసా. లేక ఒంటరిగా మనసా!" వెటకారంచేసి వెళ్ళిపోయాడు. శశి పది నిమిషాలకు తేరుకుంది. రాత్రి అక్కకు గదిలో పక్కవేసి భర్తకు హాల్లోవేసింది. వస్తూనే చిర, బురలాడినాడు రవి.

"ఈ పుస్తకాలలా యెవరు తగలేశారు! మన పడకగదిలోకి అందరినీ రానివ్వకు శశీ!"

"అక్కయ్య మేలుకునే ఉంది. ఏమిటా గావు కేకలు. నెమ్మదిగా అనలేరు."

"కొంప ధర్మసత్రము అయిపోయింది. ఖర్చుకు ఖర్చు పైగా భయపడాలి. ఛీ మీ అక్కయ్యను తొందరగా దయచెయ్యమను."

"మీరు సురేఖ అక్కయ్య గురించేనా మాట్లాడేది. ఆమె చేసిన ఉపకారము అప్పుడే మరిచి పోయారా?" దుఃఖం దిగమింగుతూ అడిగింది.

"చేసింద్లే...మహా ఉపకారము. కొన్నాళ్ళ యింట్లో ఉంచుకుంది. వాళ్ళబ్బాయి పెద్దవాడయ్యాక నేను చదివిస్తాను. మై స్వీట్ హార్ట్.... ఇన్ అవర్ స్వీట్ హోమ్..." శశిని దగ్గరకు తీసుకుని ఏమో చెప్పబోయాడు. విదిలించికొట్టింది.

"చాల్లెండి. సురేఖ దేవత, దయ్యం... అని పొగడి..."

"శశీ..." గదిలో నుండి అక్కపిలుపు వినిపించింది. మ్లానవదనంతో వెళ్ళిపోయింది. రవి మంచములేక కుర్చీలో వాలిపొయ్యాడు.

"అక్కా..." బావురుమంది.

"పిచ్చిదానా ఊర్కో...నీ కింత కష్టం కలుగుతుందంటే వచ్చేదాన్నేకాదు. రేపు వెళ్ళిపోతాను," చెల్లి తల నిమిరింది.

"వద్దక్కా ఆ మాటనకు. ఆయన యెందుకిలా మారిపోయారో అర్థం కావటం లేదు. సురేఖ, పద్మ నాకు పూజనీయులే అనేవారు. రేపు గట్టిగా అడుగుతాను,"

"నా గురించి మీరు ఘర్షణ పడటం బావుండదు శశీ. స్త్రీజన్మే అంత. భర్త అనుకూలుడు అయితే సుఖం, లేకుంటే జీవితాంతం దుఃఖమే. సంసారము ఒక మధురమైన యుగళగీతి. భార్యాభర్తలు ఒకరి నొకరు అర్థం చేసుకుని, ఒకరి బంధువుల నొకరు గౌరవించుకుంటే యెంతో మధురంగా సాగుతుంది జీవితం. చాలామంది యువతీ-యువకులకు. ఆవేశం తప్పితే, ఆలోచనేరాదు! బంధువులు లేక భర్త ఆకాశంనుండి ఊడిపడిందని భార్య. భార్యతప్ప మిగిలినవారు పరాయివారని భర్త భావిస్తారు." ఆ మాటలు సూటిగా శశికే తగిలాయి.

"వారు నన్నెంత అభిమానించేవారో యెలా చెప్పేది. ఇప్పుడిలా యెందుకు మారిపోయారో..." తనమీద ప్రతీకారం తీర్చుకుంటున్నాడేమో నని చెప్పటానికి సంకోచపడింది.

"వివాహం జీవితంలో ఒక మలుపు శశీ. ఆ మలుపులో కొందరు నిలదొక్కుకుంటారు. కొందరు బోల్తా కొడతారు. స్త్రీ సౌజన్యమూర్తి అయితే సగము సమస్యలు పరిష్కరింపబడతాయి. రవి ఇలా ప్రవర్తించటాని అతని తల్లి, అక్క వస్తే నువ్వు నిర్లక్ష్యం చేసేవు." మౌనంగా కన్నీరు కార్చింది శశి. మర్నాడు సురేఖ ప్రయాణం అవుతుండగా యెటో వెళ్ళాడు రవి. శశి అక్కతో స్టేషన్‌వరకు వస్తానంది.

అతనింట్లో లేడు. నువ్వురావటం బావుండదు. నేను వెళ్ళగలను." పనిమనిషిచేత రిక్షా తెప్పించుకొని వెళ్ళింది సురేఖ. అక్కను సాగనంపి బావురుమంది శశి.

స్టేషన్లో టికెట్టుకొని, బట్టల ప్యాకెట్లు పట్టుకుని నిల్చున్నాడు రవి.

"మిమ్మల్నిలా పంపడము చాలా బాధగా ఉందండీ,"

"పరవాలేదు, మందు చేదయినా రోగం కుదుర్చుకోవటానికి త్రాగుతాం. నువ్వు మాత్రం జాగ్రత్తగా వ్యవహరించు, కన్నీటికి లొంగిపోకు." యెన్నో విధాలుగా నచ్చచెప్పింది సురేఖ. వదినను పంపివేసి హుషారుగా యింటికి వచ్చాడు.

"శశీ డార్లింగ్ లే-మార్నింగ్ షో ఉంది."

"ఛ—నాతో మాట్లాడకండి" దిండులో తల దూర్చి వెక్కి, వెక్కి ఏడ్చింది. గుంభనంగా నవ్వుకున్నాడు.

* * *

శశి తల్లి దండ్రులు దక్షిణ దేశం యాత్రకని బయలుదేరు తున్నారట. కూతురి దగ్గర ఓ పది రోజులుండి, చుట్టుపట్ల గల పుణ్య తీర్థాలు చూస్తామని రాశారు. ఉత్సాహంగా భర్తకు ఉత్తరం చూపింది. అతని అజ్ఞ విని దెబ్బతిన్న లేడిలా చూచింది.

"మీరు నిజంగానే అంటున్నారా ..." హీన స్వరంతో అడిగింది.

"అబద్ధం యెందుకంటాను. కొత్త దంపతుల మన్న జ్ఞాపకముందా! పది రోజులు కాదు, పది గంటలు కూడా ఉండవద్దు."

"నా తల్లి దండ్రులకు గౌరవము లేని చోట నేను మాత్రం దేనికి?"

"అది నిర్ణయించు కోవల్సిన దానవు నువ్వు. నీ కోసం నా తల్లిని కాదనలేదూ? అహోరాత్రులు నా కోసం కష్ట పడింది. అవమానాలు భరించింది. నా చుట్టూ ఆశలు అల్లుకుంది. ఇప్పుడన్నీ విస్మరించ లేదూ? యెందుకంటావ్ డార్లింగ్? నీ కోసం...లెట్ యువర్ పేరెంట్స్‌గో టు హెల్. మనము హాయిగా ఉందాము, పిక్చరుకి వెళ్దామా, ప్రతాప్‌లో మంచి పిక్చరుంది."

"అలాగే వెళ్దాం ఈ ఒక్క సారికి అమ్మా వాళ్ళను రానియ్యండి మరెప్పుడూ అడగను. ఒట్టండి. మన సంసారం చూడాలని ముచ్చటపడి వస్తే వద్దని యెలా రాయను?"

"చేతో రాయి. నేను ముఖాముఖిగా మాఅమ్మతో చెప్పలేదు! మా స్వర్గంలో నీవుండరాదమ్మా, పాతిక రూపాయలు పారేస్తాను, పడుల వంపలో బ్రతుకు అనలేదూ. సంసారం అంటే యుగళగీతి అంటారు - నాతో జతకలపకపోతే అపశ్రుతే, మై స్వీట్ హార్ట్... మీ అమ్మ నిన్ను కనలేదు, మా అమ్మనన్ను కన్నది. ఈ జన్మ ఎందుకని వంటిల్లు అప్పగించి వరండాలోపడుకోబెట్టి వెళ్ళగొట్టలేదూ! ఆలోచించు." యేమాలోచిస్తుంది. ఏడ్చింది. రవి లెక్కచెయ్యక టెన్నిస్ రాకెట్ ఊపుకుంటూ వెళ్ళిపోయాడు. శశి కుప్పలా కూలిపోయింది. అందమైనవాడు. అనుకూలమైనవాడు. అన్యోన్యంగా ఉంటూ, జీవితంలోని మధురిమనంతా చవిచూడాలనుకుంది, ఇలా జరిగిందేమిటి? యెందుకు జరిగింది, తప్పు రవిదా? ఆత్మపరిశీలన మొదలయింది.

'మేము మీ ఉత్తరం రాకముందే ఢిల్లీవెళ్ళాలని నిర్ణయించుకున్నాం. మీరు ఏమీ అనుకోవద్దని' కార్డు తండ్రికి రాసింది. రెండురోజులు ముభావంగా భారంగా గడిచాయి, శశిరేఖ తేలిగ్గా ఊపిరిపీల్చింది, ఆమె ప్రశ్నకు జవాబు దొరికింది, నవ్వుకుంది.

రవి ఇంటికి వచ్చేసరికి తాళంవేసి ఉంది. పక్కింటివాళ్ళు తాళంచేతులు యిచ్చారు, అతని పుస్తకాల పెట్టె బల్లమీద ఉత్తరం కనుపించింది, సంబోధనా సంతకం ఏంలేవు.

మీ యిల్లు జాగ్రత్తగా చూచుకోండి. నేను యెప్పుడు వచ్చేది తెలియదు.

"ఊహు అలకన్న మాట పోనీ ... ఒకసారి మనసులు విరిగితే అతుకుతాయా! ఈ విషయము సురేఖకు రాయాలా, వద్దా? ఆలోచిస్తూ మంచముపై వాలిపోయాడు. కసిగా పళ్ళు బిగుసుకున్నాయి. ఆడదానికి అంత పట్టుదల అయితే తనకేనా, లేనిది?'

హోటలు భోజనము, సినిమా, షికారు, నిద్ర-వారం రోజులు దొర్లాయి, అతని పట్టుదల సడలిపోయింది. సురేఖ దగ్గరకు వెళ్ళి ఈ విషయానికి పరిష్కారం ఆలోచించాలి అని లేచాడు. యెవరో తలుపు తట్టారు. వెళ్ళి తలుపు తీసి ఆశ్చర్యంగా, సంభ్రమంగా చూచాడు. శశిరేఖ వెనుకాల కాంతమ్మ ఉంది.

"ఏరా అలా ముఖం పీక్కుపోయింది?" తల్లి అడిగింది.

"అదంతా మీ మీది బెంగలే అత్తయ్యా" నవ్వుతూ సామాను తెచ్చింది శశి. తల్లి అటు వెళ్ళగానే శశి జడ చేజిక్కించుకున్నాడు.

"ఎక్కడికి వెళ్తున్నావో చెబితే అరిగిపోయావా."

"నాటకాలు ఆడి మీరే అరిగి పోయారులెండి. అసలు అక్కయ్యను అనాల" చిరుకోపం ప్రదర్శించింది శశి.

"మన యుగళ గీతానికి శృతి చేసిన సురేఖను ఏమన్నా సహించేది లేదు" వెక్కిరించి, కసితీరా ఆమె తలపై మొట్టాడు. శశి వెక్కిరించి వంట యింట్లోకి వెళ్ళింది.